క్లుప్తంగా

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పోతలయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గోదాముకు 21 వేల పాఠ్యపుస్తకాలు




పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ గోపాల్ నాయక్

ధర్మవరం రూరల్: 2024–25 సంవత్సరానికి గాను 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు స్థానిక గోదాముకు చేరినట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 21 వేల పాఠ్యపుస్తకాలు, 73,390 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. సోమవారం 8, 9, 10 తరగతులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు రానున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు పాఠశాల స్థాయిలో సంసిద్ధత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఆయా విద్యార్థుల ఇళ్ల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.

కార్తికేయునికి విశేష పూజలు





అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథుడు, పార్వతీ దేవి



ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో ఉన్న సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు బంగారు ఆబరణాలతో పాటు, పట్టు వస్త్రాలు ధరింప చేసి ఆకుపూజ, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పోలింగ్ గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంతోష్‌కుమార్

పావగడ: స్థానిక ఆగ్నేయ ఉపాధ్యాయుల విధాన పరిషత్ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఇందులో భాగంగానే తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఆదివారం మాట్లాడుతూ తాలూకా కార్యాలయంలో పోలింగ్ సులభతరంగా ఉండడానికి రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. న్యాయాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 400 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవచ్చన్నారు. అలాగే గ్రేడ్– 2 తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 403 మంది ఓటర్లు ఓటు వేయవచ్చని వెల్లడించారు. మొత్తం ఓటర్లు 803 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఓటర్లందరికీ ఓటరు చీటీలు అందించామన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పనిసరిగా ఓటరు చీటీలు తీసుకురావాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు.

లోదుక్కులతో ప్రయోజనాలెన్నో...

- తెగుళ్లు దూరం
- అధిక దిగుబడులకు మార్గం



బత్తలపల్లి మండలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

బత్తలపల్లి: వేసవి దుక్కులతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ట్రాక్టర్లతో పొలాలను దున్నుతూ ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వేసవి దుక్కుల వల్ల పంటలను పలు తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో ఏటా ఖరీఫ్‌లో సుమారు 70 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ, ఏడు వేల హెక్టార్లకు పైగా వరి పంటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ భూములను ట్రాక్టర్లతో లోతుగా, మెత్తగా దున్నిస్తున్నారు. లోతైన దుక్కు వల్ల నేలలోని పోషకాలు పైకి రావడంతో దిగుబడి పెరుగుతుందని అంటున్నారు.

చీడపీడల నివారణ

పంటల్లో కాండం తొలుచు, ఆకుముడత, కాండం కుళ్లు తెగుళ్లకు కారకాలైన పురుగుల గుడ్లు నేల లోపలి పొరల్లో ఉండటం వల్ల తదనంతరం వచ్చే పంటల్లో మళ్లీ ఆ తెగుళ్లు వ్యాప్తి చెంది పంటల్ని నాశనం చేస్తాయి. వేసవిలో లోతుగా దున్నడం వల్ల వివిధ తెగుళ్లకు కారకాలమయ్యే పురుగుల గుడ్లు బయటకు వచ్చి ఎండ వేడికి అందులోని జీవం చనిపోవడం లేదా పక్షులు తినేయడంతో పంటలపై తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, కలుపు మొక్కల మూలాలు ఎండ దెబ్బకు ఎండిపోయి, వాటి ఉధృతి బాగా తగ్గుతుంది. నేల సారవంతమవుతుంది. దీని వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్‌లో పంట సాగు వివరాలు... (హెక్టార్లలో)		
మండలం	వేరుశనగ	వరి
ధర్మవరం	17,000	7,000
బత్తలపల్లి	12,500	178
తాడిమర్రి	14,000	200
ముదిగుబ్బ	19,000	120

నేల సారవంతం



వేసవి దుక్కుల వల్ల ఖరీఫ్ పంటలో తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. గత పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించడమే కాకుండా నేల సారవంతమవుతుంది. మొండి కలుపు మొక్కలు నివారించుకోవచ్చు. దీని వల్ల చాలా వరకూ ఖర్చులు తగ్గుతాయి. రైతులందరూ వేసవి దుక్కులు చేయడం వల్ల ఖరీఫ్ పంటలకు మేలు జరుగుతుంది. అధిక దిగుబడి సాధించవచ్చు.

–ఓబిరెడ్డి, వ్యవసాయాధికారి, బత్తలపల్లి

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన 'బత్తుల'



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన బత్తుల హరిప్రసాద్, వజ్రబాస్కర్‌రెడ్డి తదితరులు

కదిరి అర్బన్: తిరుపతిలో రాష్ట్ర గనులు, భూగర్భ, అటవీ శాఖా మంత్రి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, సీనియర్‌నాయకులు డా. బత్తల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీ విషయాలపై చర్చించారు. న్యాయవాది అబూబకర్, నామా రాము, ఏసు తదితరులు ఉన్నారు.

మండల కన్వీనర్‌కు కన్నీటి వీడ్కోలు



జగన్‌మోహన్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి దంపతులు



అంతిమయాత్రలో పాల్గొన్న జనం

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డికి జనం కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన శనివారం రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఆదివారం జగన్‌మోహన్‌రెడ్డి స్వగ్రామం నారేపల్లిలో అంత్యక్రియలు పూర్తిచేశారు. గ్రామపెద్ద మరణించడంతో గ్రామంలో రెండురోజులుగా విషాదఛాయలు నెలకొన్నాయి. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి అపర్ణారెడ్డితో నారేపల్లికి చేరుకుని జగన్‌మోహన్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళలర్పించారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ అధైర్యపడవద్దు అండగా ఉంటామని తెలిపారు. జగన్‌మోహన్ మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది పార్టీ శ్రేణుల నడుమ అంతిమ యాత్ర సాగింది. గ్రామ సమీపంలోని ఆయన మామిడితోటలో అంత్యక్రియలు పూర్తిచేశారు. అనంతపురం వైఎస్సార్‌సీపీ నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి, హిందూపురం వేణురెడ్డి, బాబురెడ్డి, ధర్మవరం నేత గుర్రం శ్రీనివాసులరెడ్డి తదితర నాయకులు హాజరయ్యారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రికార్డులు లేని బైకులను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు



పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ దిలీప్‌కుమార్



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

బత్తలపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, మద్యం విక్రయించే వారి ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోదాల్లో రికార్డులు లేని ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వడ్డెర కాలనీ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలోని సమావేశమయ్యారు. జూన్ 4వ తేదీన ఎవరు గెలిచినా ఓడినా ప్రతీ ఒక్కరూ శాంతియుతంగా నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల ఫలితాల రోజున బాణాసంచా పేల్చడం, చిందులు వేయడం, సంబరాలు జరుపుకోవడం చేయరాదన్నారు. పాతకక్షలు మనసులో ఉంచుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తలుపుల : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కోరారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో జనాలు గుంపులుగా ఉండరాదన్నారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాండ్లపెంట: సార్వత్రిక ఎన్నికల కోడ్ ఈ నెల 6వ తేదీ వరకు ఉందని ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ కృష్ణవేణి హెచ్చరించారు. ఆదివారం ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ పోలీస్‌యాక్ట్–30, 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరూ రోడ్లపై గుంపులుగా ఉండకూడదన్నారు. ఎన్నికల కౌటింగ్ సమయంలో ఎవరూ బాణాసంచా కాల్చడం కాని, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా ఉండాలి

అమడగూరు: ఓట్ల లెక్కింపు రోజున అన్ని పార్టీల నాయకులు ప్రశాంతంగా ఉండాలని సీఐ రాజేంద్ర నాథ్ యాదవ్ సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో మండల వ్యాప్తంగా ఇటీవల బైండోవర్ చేసిన వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సీఐ మాట్లాడారు. ఓట్ల లెక్కింపులో గెలిచిన పార్టీ నేతలు అనవసరంగా ఇతరులను రెచ్చగొట్టినా, ఊరేగింపులు చేపట్టినా, బాణాసంచా పేల్చినా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరూ చట్టాన్ని అతిక్రమించొద్దని సూచించారు. అనవసరంగా వీధుల్లోకి వచ్చి గొడవలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ మగ్బూల్‌బాషా, జమేదారు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం డివిజన్‌లో మోస్తరు వర్షం



కొండ్రెడ్డిబావి వద్ద మరువ పారుతున్న చెక్‌డ్యాం



కట్టకిందపల్లి వద్ద పారుతున్న వంక

ధర్మవరం రూరల్: ధర్మవరం డివిజన్‌లో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వంకలు, ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలలోకి నీరు చేరింది. వాతావరణం అనుకూలించడంతో ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో ఇప్పటికే అదునుకు తగ్గట్టుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలాలను దుక్కులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ముందుగానే రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తోంది. కురుస్తున్న వర్షాలతో బోరు బావులలో నీరు వృద్ధి చెందుతుందని రైతులు అంటున్నారు.

డివిజన్‌లో వర్షపాతం ఇలా..

ధర్మవరంలో 9.6 మి.మీటర్లు, బత్తలపల్లి మండలంలో 3.4 మి.మీటర్లు, తాడిమర్రి 5.8, కనగానపల్లి మండలంలో 54.2, రామగిరి మండలంలో 33.4 మి.మీటర్లు, చెన్నేకొత్తపల్లి మండలంలో 22.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెపుతున్నారు. ఈ వర్షం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కనగానపల్లిలో 54.2 మి.మీ వర్షం

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కనగానపల్లి, దాదులూరు, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో 54 మి.మీ పైగా వర్షపాతం నమోదనట్లు అధికారులు తెలిపారు. దీంతో పలుచోట్ల వాగులు, వంకలు పారగా, నీటి కుంటలు, చెరువుల్లోకి వర్షపు చేరింది. గాలివాన దెబ్బకు కనగానపల్లి– మామిళ్లపల్లి రహదారి పక్కన పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి.



కుర్లపల్లి సమీపంలో నిండిన నీటి కుంట



కనగానపల్లి- మామిళ్లపల్లి రహదారి పక్కన నేలకొరిగిన చెట్లు

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

- ముగిసిన టేబుల్ టెన్నిస్,చెస్ శిక్షణ తరగతులు



క్రీడాకారులకు మెడల్స్ అందిస్తున్న కళాజ్యోతి కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సీనియర్ చెస్ క్రీడాకారులు రామకృష్ణ, పీడీ రమేష్, జగ్గా వేణుగోపాల్, కళాజ్యోతి కమిటీ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ సూచించారు. స్థానిక కళాజ్యోతిలో ఆదివారం సాయంత్రం వేసవి టేబుల్ టెన్నిస్, చెస్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 25 నుంచి ఈనెల 2వతేదీ వరకు 35 రోజులపాటు ఉచితంగా టేబుల్ టెన్నిస్, చెస్, క్యూబ్ సాల్వింగ్ వేసవి శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. టేబుల్ టెన్నిస్ శిక్షకుడు నాగేంద్ర, చెస్ శిక్షకుడు శివకృష్ణ, క్యూబ్ సాల్వింగ్ శిక్షకుడు కిషోర్‌కుమార్‌లు విద్యార్థులను క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దారని తెలిపారు. టేబుల్ టెన్నిస్‌లో 60 మంది, చెస్‌లో 200, క్యూబ్ సాల్వింగ్ శిక్షణలో 60 మంది విద్యార్థులు శిక్షణపొందారన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన

అమరాపురం: మండలంలోని రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకు ఎస్‌ఐ జనార్దన నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీన హిందూపురంలోని బిట్ కళాశాలలో మడకశిర ఎమ్మెల్యే , ఎంపీ అభ్యర్థుల ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లే వారు ఎలాంటి నియమ నిబంధనలు పాటించాలి? వారి బాధ్యతలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐ రామంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం అన్నమయ్య జిల్లా హార్సిలీ హిల్స్ వేదికగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి అల్లరి, ఉపాధ్యాయుల దండనలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. 42 సంవత్సరాల తర్వాత కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

సేంద్రియ సాగుపై ఆసక్తి



తనకల్లులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలోని వర్మీ కంపోస్టు

తనకల్లు: రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలను పాటిస్తూ పశు, ఇతర వ్యర్థాలతో భూసారం పెంచుతున్నారు. సాధారణంగా రసాయనిక ఎరువులతో ఎకరా సాగుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు వస్తుంది. అయితే రసాయనిక ఎరువుల ఖర్చుతో పోల్చితే సేంద్రియ ఎరువులకు అయ్యే ఖర్చు చాలా తక్కువని రైతులు అంటున్నారు. సాధారణంగా మొక్కల పెరుగుదల, నేల ఉత్పాదక శక్తికి ఉపయోగపడే పోషకాలు మన నేలల్లో తక్కువగా ఉంటాయి. ఒకే పొలంలో ఏటా పలు రకాల పంటలను పండించటంతో కొద్దిపాటి పోషకాలు తరిగిపోతున్నాయి. నేలలో వాటిని పెంచుతూ అధిక దిగుబడులు పొందాలంటే పశువుల పేడ, కంపోస్టు, పచ్చిరొట్ట తదితరాలు వినియోగించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సేంద్రియ ఎరువుల ప్రోత్సాహం కోసం ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పాడి, తడి చెత్త నుంచి కంపోస్టులో వానపాములను పెంచి ఎరువును తయారు చేసి రైతులకు కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

వేరుశనగ సాగుకు సన్నద్ధం

తనకల్లు: ముందస్తు వర్షాలతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. సంప్రదాయ పంట వేరుశనగ సాగుకు అత్యధికమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. కదిరి నియోజకవర్గంలో ఆరు మండలాల పరిధిలోని ఆర్‌బీకేలకు ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగకాయలను సరఫరా చేసింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది విత్తనకాయల పంపిణీ చేపట్టారు. గత ఏడాది వర్షాభావం కారణంగా వేరుశనగ సాగుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురిసే అవకాశం ఉండడంతో వేరుశనగ సాగుకు ముందుకొస్తున్నారు. ఇప్పటికే పొలాలు దుక్కి దున్ని, చదును చేశారు.

సేంద్రియ ఎరువుల్లో అధిక పోషకాలు



సేంద్రియ ఎరువుల్లో అధిక పోషకాలుంటాయి. దీనికి అయ్యే ఖర్చు చాలా తక్కువ. వర్మీ కంపోస్టు, పశువుల పేడతో తయారైన సేంద్రియ ఎరువులను వాడడం మంచిది. ఇందులో నత్రజని, భాస్వరం, పొటాష్ అధికంగా ఉంటాయి. రసాయనిక ఎరువులను తగ్గించి వాడుకోవాలి. అధిక దిగుబడులు రావడం వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది.

– శ్రీహరినాయక్, ఏఓ, తనకల్లు